


కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య మృతి


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 17 డిసెంబరు , 2025 | పేజీలు : 06


# ఎన్నికల విధులు
## పారదర్శకంగా, నిష్పక్షపాతంగా

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

### డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్/ గరిడేపల్లి/నేరేడుచర్ల/ పాలకవీడు/ చింతలపాలెం:** సిబ్బంది ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, బాధ్యతతో విధులు నిర్వహించి, ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఎన్నికలపై నమ్మకం కలిగే విధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అదేశించారు. నేడు నిర్వహించే మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మంగళవారం గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి, హుజూర్‌నగర్ మండలాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల పరిధిలోని 146 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు, 1318 వార్డు మెంబర్లకు ఎన్నికల నోటఫికేషన్ విడుదల చేయగా 22 సర్పంచులు, 257 వార్డు సభ్యులు ఏకగ్రీవం కావడంతో నేడు నిర్వహించే 124 గ్రామ పంచాయతీలకు, 1061 వార్డు సభ్యులకు 1176 పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు పోలింగ్ సామాగ్రి అంతా తీసుకున్నారో లేదో మరో సారి పరిశీలించుకోవాలని, కొన్నిచోట్ల సర్పంచులు ఏకగ్రీవమైన చోట్ల వార్డులకు ఎన్నిక జరుగుతుందని, వార్డు సభ్యులు ఏకగ్రీవమైన చోట సర్పంచులకు ఎన్నిక ఉంటుందని,బ్యాలెట్ పేపర్లు తీసుకునే విషయంలో ఆర్వో ఎన్నికల సిబ్బంది చాల జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తర్వాత అక్కడ ఏమైనా సమస్యలుంటే వెంటనే పంచాయతీ కార్యదర్శి, ఎంపిడివోకు సమాచారం అందిస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. పోటీ చేసే అభ్యర్థుల పేర్లకు ఎదురుగా వారి గుర్తులు జాగ్రత్తగా అతికించి పోలింగ్ కేంద్రం ముందు ప్రదర్శించాలని సూచించారు. పోలింగ్ సమయం ఉదయం ఏడు గంటల నుండి మద్యాహ్నం ఒంటి గంట కన్న ముందే ఏదైనా ఒక పోలింగ్ కేంద్రంలో 100 శాతం నమోదైనప్పటికీ మద్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ బ్యాలెట్ బాక్స్ సీల్ చేయరాదని, ఫారంలు నింపరాదని, ఒక వేళ ముందే పూర్తి అయిందని బ్యాలెట్ బాక్స్‌లు సీల్ చేసి ఫారంలు నింపితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. మద్యాహ్నం రెండు గంటల నుండి లెక్కింపు ప్రక్రీయ నిర్వహించేటప్పుడు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, అప్పటి నుండి ఎన్నిక ఫలితాలు పూర్తయ్యేంత వరకు ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తయ్యే వరకు వీడియోగ్రఫి చేయాలన్నారు. సందేహం ఉన్న ఓట్లపై నిర్ణయం వచ్చిన తర్వాతే లెక్కింపు ప్రక్రీయ ప్రారంభించాలని, సర్పంచ్ ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేలా మొదటి నోటిస్ ఇవ్వాలని, అప్పుడు సాధ్యం కాకపోతే తదుపరి రెండవ నోటీస్ జారీ చేసి 18నకోరం ఏర్పడితే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని, రెండోసారి సాధ్యం కాకపోతే అదే రోజు మద్యాహ్నం మూడవ నోటీస్ జారీ చేసి కోరం లేకుండానే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఎక్కువ ఓట్లు ఉన్న చోట ఆర్వోలకి సహాయం చేయుటకు ఏఆర్వోలను నియమించి ఎన్నికల కమిషన్ సూచనల మేరకు, రెండు, మూడు ్ధడు ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత గాని, రికౌటింగ్ చేసేటప్పుడు గాని జిల్లా ఎన్నికల విభాగం అనుమతితో ఎన్నికల ఫలితాలు ప్రకటించాలని, అలాగే రికౌంటింగ్ చేయాలని సూచించారు. రికౌంటింగ్ చేసేటప్పుడు రివేరిఫికేషన్ చేయరాదని కేవలం ఓట్లు మాత్రమే లెక్కించాలని సూచించారు. ఎన్నికల నిర్వహించే గ్రామాల్లో శాంతిభద్రత విషయంలో పోలింగ్ విషయంలో ఏమైన గందరగోళ పరిస్థితి ఏర్పడిన, అవాంచనీయ సంఘటనలు జరిగిన వెంటనే పై అధికారులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాలలో పంచాయతీ సిబ్బంది ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరు ఓటు వేయటం బాధ్యతగా బావించి ఓటింగ్ ప్రక్రీయలో పాల్గొని పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ఫలితాలు వెల్లడించిన తర్వాత ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, బాణసంచాలు కాల్చడం లాంటివి చేయకుండా ఎన్నికల ప్రక్రీయ ప్రశాంతంగా ముగిసే విధంగా అభ్యర్థులు, అధికారులు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట ఎంపీడీవోలు సరోజ, సోమసుందర్‌రెడ్డి, లక్ష్మి, జగదీష్, సుమంత్, తహసిల్దార్లు స్రవంతి పాల్గొన్నారు.




## తప్పలు చేస్తే కఠిన చర్యలు

### తప్పులు లేకుండా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచన

### డిఆర్‌సి కేంద్రాన్ని సందర్శించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

## కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణ

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** స్థానిక సంస్థ ఎన్నికలలో పార్టీ విధానాలను అనుసరించకుండా వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిని కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్టు నక్కలపల్లి గ్రామ అధ్యక్షుడు మాతంగి యాదయ్య తెలిపారు. నక్కలపల్లి గ్రామానికి చెందిన చినేటి సత్యనారాయణ,గద్దగూటి నాగరాజ,దొంతరబోయిన సాగర్,బండ జగన్మోహన్ రెడ్డి,చిలుకూరి చంద్రయ్యలు ఎన్నికలలో పార్టీలో ఉంటూనే పార్టీ విధానాలకు,అభ్యర్థులకు వ్యతిరేకంగా కార్యక్రమాల్లో పాల్గొన్నందున కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి బహిష్కరిస్తున్నట్లు నక్కలపల్లి గ్రామశాఖ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ అధ్యక్షుడు తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లో నూ సాహించేది లేదని,భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

## మూడో విడత ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత




### పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలు

### 9మండలాల్లోని 269 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు

### విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు : జిల్లా ఎస్‌పి

## జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** హైద్రాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ జూనియర్ కళాశాలలో 2025/26 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి 15 నుంచి జనవరి 15వరకు దరఖాస్తు చేసుకోవాలని హైద్రాబాద్ జకాత్ ట్రస్ట్ నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి ఎండి. నిరంజన్ అలీ సోమవారం తెలిపారు. కార్పోరేట్ స్థాయిలో రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ విద్యనందిస్తారని, బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. రెండు సంవత్సరాల ఇంటర్ విద్యతోపాటు నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల పేద ముస్లీం, ముస్లీమేతర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు మొబైల్ నెంబర్ 9866550886ను సంప్రదించాలన్నారు.

## సర్పంచ్‌లకు సన్మానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్‌లో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆయా గ్రామపంచాయతీ నుంచి సర్పంచ్ అభ్యర్థులుగా గెలిచిన సర్పంచ్‌లను ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మంగళవారం ఆయన ఇంట్లో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## టాప్రా జిల్లా మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 21న మిర్యాలగూడలో జిల్లా టాప్రా జిల్లా మహాసభ జరగనున్నందున అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగదీశ్‌చంద్ర, శ్యాంసుందర్‌లు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మహాసభకు రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ రెడ్డి, కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే నర్సిరెడ్డి, టాప్రా నాయకులు జనార్దన్‌రెడ్డిలు హాజరవుతారని అన్నారు. ఈ మహాసభలో సమస్యలపై చర్చించి పోరాటాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్‌సీ అందించాలని, పెన్షన్ బెనిఫిట్స్, మెడికల్ రియంబర్స్‌మెంట్, ప్రతి జిల్లాకు ఒక వెల్నెస్ సెంటర్ ప్రారంభించాలని, నగదు రహిత ఆరోగ్య కార్డు ఇప్పించాలని అన్నారు. మహాసభకు జిల్లాలోని సుమారు 200 మంది మాజరుకానున్నందున ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు.

## గ్రామాభివృద్ధే నా ధ్యేయం

**ప్రజాపక్షం/మోతె :** గ్రామాభివృద్ధే నా ధ్యేయమని సర్పంచ్‌గా గెలుపొందిన కోడి లింగయ్య యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో గ్రామవార్డు సభ్యులు గ్రామ మహిళలు కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించారు. 10వ వార్డు సభ్యులు పొడపంగు హరిబాబు, ఉపేందర్, కవిత, రజిత, జ్యోతి, శ్రావ్య, వాణి, శైలజ పాల్గొన్నారు.



## కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని మండల వైద్యాధికారిణి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భూదాన్ పోచంపల్లిలో ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలకు కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం సమగ్ర సర్వే కోసం శిక్షణ కార్యక్రమాన్ని రేపటి నుండి ఈనెల 31 వరకు 14 రోజులు సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంకు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని కార్యకర్తలకు ఎల్సీడీసీ సర్వేపై సమగ్రమైన సమాచారము శిక్షణ వ్యాధిగ్రస్తులను ఎలా గుర్తించాలో వారికి వివరించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యులంతా ఈ సర్వేలో తప్పకుండా పాల్గొనాలని కోరారు. కుష్టు వ్యాధి ఒక సామాన్యమైన వ్యాధి ఇది మైకోబాక్టీరియం లెప్రై అనే సూక్ష్మ క్రిమి ద్వారా సంక్రమిస్తుందని చెప్పారు. ఇది వంశ



పారంపర్యం వ్యాధి కాదనీ ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చనీ చర్మంపై ఎర్రని గోధుమ రంగు స్పర్శ లేని మచ్చలు కుష్టు వ్యాధి గుర్తుగా భావించి వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి డాక్టర్ పరిరక్షణలో రోగాన్ని పూర్తిగా నయం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శ్రీనివాస్, అరుంధతి, శ్రీదేవి, మండల రెప్రసెంటేటివ్ ఆఫీసర్ యంఏ బేగ్, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రఫీలో జాతీయ స్థాయి అవార్డు



**ప్రజాపక్షం/చిట్యాల:** లంబాడీల జీవనశైలి, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయలపై నిర్వహించిన ఫోటోగ్రఫీ వర్క్‌షాప్ మరియు అవార్డుకు గాను నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన ప్రముఖ ఫోటో గ్రాఫర్, సీనియర్ పాత్రికేయులు ఏళ్ళ భయ్యన్నకు జాతీయ స్థాయిలో స్పెషల్ చిత్రం లంబాడా అవార్డు లభించింది. ఖమ్మం జిల్లా ఇల్లందు మండలం రాళ్ళబంద గ్రామంలో ఈ నెల 13 నుండి 15 వరకు ప్రముఖ ఫాకల్టీ హస్సేన్ ఖాన్ గారి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి లంబాడీ లైఫ్ స్టైల్ ఫోటోగ్రఫీ వర్క్‌షాప్‌లో భయ్యన్న తన ఫోటోగ్రఫీ చిత్రాలను ప్రదర్శించారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఫోటోగ్రాఫర్లు, కళాకారులు, సంస్కృతి ప్రేమికులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని లంబాడి మహిళల జీవితం, వారి శ్రమ, ఆనందం, సంప్రదాయాలు, వారి జీవన విధానాన్ని ఫోటోల ద్వారా ప్రపంచానికి తెలియపరిచారు. లంబాడీ అవార్డ్ ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు తమ్మ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా భయ్యన్న అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా భయ్యన్నను ఫోటోగ్రాఫర్లు, స్నేహితులు, సన్నిహితులు అభినందనలు తెలియజేశారు.

## శ్రీచైతన్య పాఠశాలలో నాసా కిట్లు పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నాసా సంస్థకు ప్రాజెక్టు సబ్మిషన్ చేయనున్న విద్యార్థులకు నాసా నుంచి టీషర్ట్స్, మెటీరియల్స్ పంపిణి కార్యక్రమం పట్టణంలోని విద్యానగర్ శ్రీచైతన్య బ్రాంచ్2లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేవీఎన్ ఇంటర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న మహేందర్‌రెడ్డి హాజరై నాసాలో పాల్గొన్న విద్యార్థులకు నాసా కిట్లను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసా వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థకు మన విద్యార్థులు ప్రాజెక్టులు పంపించి గుర్తింపు పొందడం అత్యంత గర్వకారణమని అన్నారు. ప్రిన్సిపల్ కుసుమ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి అవకాశాలను మరింత



తగా వినియోగించుకొని పరిశోధనా దృక్పథంతో ముందుకు సాగాలని, ఇలాంటి అవకాశాలు శ్రీచైతన్య విద్యా సంస్థలకు మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీధర్, శ్రీవిద్య, ఏజీఎం సుజిత, ప్రిన్సిపాల్ కుసుమ, కోఆర్డినేటర్ వెంకట్, డీన్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేణారెడ్డిని కలిసిన సర్పంచ్ బొల్లికొండ సైదులు

**ప్రజాపక్షం/చివ్వెంల :** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డిని నూతనంగా ఎన్నికైన గుంజలూరు సర్పంచ్ బొల్లికొండ సైదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## అన్నప్రసాద వితరణ

**ప్రజాపక్షం/కోదాడ:** మాలధారులకు నిత్య అన్నప్రసాద వితరణ నిర్వహణ అభినందనీయమని కోదాడ పట్టణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సైదులు అన్నారు. మంగళవారం పట్టణ పరిధి హుజూర్‌నగర్ రోడ్డులోని గాలి రమేష్‌నాయుడు జ్ఞాపకార్థం సోదరుడు గాలి శ్రీనివాస్‌నాయుడు నిర్వహిస్తున్న నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీతారాంసింగ్, గురుస్వాములు, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.





## తుంగపాడు సర్పంచ్‌కు సన్మానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో మండలంలోని తుంగపాడు గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి బెదుదూరు వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొమ్మరాజుల నరసింహాతోపాటు వార్డు సభ్యులు గెలుపొందగా మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌లు ఘనంగా సత్కరించారు. ఎన్నికైన వారికి ప్రజలకు చేరువ కాగా ప్రజలకు దగ్గరగా ఉండాలని ప్రజలకు అందుబాటులో ఉండి వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కంచుగట్ల లింగయ్యయాదవ్, సూదిరెడ్డి శేఖర్‌రెడ్డి, రెమడాల శ్రీనివాస్, చింతరెడ్డి సైదిరెడ్డి, మచ్చ వెంకన్న, కరుణాకర్ రెడ్డి, చెన్నారెడ్డి, కాసాని శ్రీను, రవీందర్‌రెడ్డి, రమణ, గాలి జాన్ రెడ్డి, గాలి సైదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ప్రపంచానికి శాంతి, ప్రేమ, క్షమాభిక్షలను సందేశంగా అందించిన యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్, సువార్త చర్చ్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేటర్ పాస్టర్ సిహెచ్ శ్యామ్‌ప్రసాద్, బిషప్ ముల్లంగి జాకబ్ రాజులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పాస్టర్ విజయలక్ష్మి అంథోని ఆధ్వర్యంలో చర్చిలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవ. బొక్క ఏలీయారాజు, రెవ. డా. జలగం జేమ్స్, రెవ. డా. జాన్‌ప్రకాష్, పాస్టర్ యల్లు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాడు ఎంపిటిసిలు.. నేడు సర్పంచులు





**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** మండలంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాజీ ఎంపీటీసీలు సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. ముత్తిరెడ్డిగూడెం పంచాయతీ సర్పంచ్ పదవి జనరల్ రిజర్వ్ చేయడంతో గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాంపల్లి కృష్ణ బరిలో నిలిచారు. కృష్ణకి 1120 ఓట్లు రాగానే సమీప అభ్యర్థి స్వామికి 331 వచ్చాయి. దీంతో 789 ఓట్ల మెజార్టీతో సర్పంచ్‌గా కృష్ణ గెలుపొందారు. మండలంలోని కునూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ రిజర్వేషన్ కాగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాశం శివానంద్ గెలుపొందారు. మొత్తం ఓట్లు 1162 పోలింగ్ కాగా ఇందులో శివానంద్‌కు 605 ఓట్లు, సమీప అభ్యర్థి శంకర్‌కు 547 ఓట్లు వచ్చాయి. 58 ఓట్లతో సర్పంచ్‌గా శివానంద్ గెలుపొందారు. 10 ఓట్లు చెల్లని ఓట్లు

## గాదరి కిషోర్ కుమార్ జన్మదినం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గుండగాని సోమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. .





## సుబ్బరామయ్య సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ సర్పంచ్‌గా చిట్టాబత్తుల సుబ్బరామయ్య సేవలు చిరస్మరణీయమని పీసీసీ డెలికెట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంథలయ చైర్మన్ వంగవీటి రామారావులు అన్నారు. సుబ్బారామయ్య 16వ వర్ధంతి సందర్బంగా రంగాథియేటర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పార సీతయ్య, ఏర్నేని వెంకటరత్నంబాబు, మార్కెట్ కమీటి వైస్ చైర్మన్ ఎస్‌కె బషీర్, వరప్రసాద్, నరసింహారావు, కందుల కోటేశ్వరావు, పాలూరి సత్యనారాయణ, పిడతల శ్రీను, దండా వీరభద్రం, కొండల్‌రెడ్డి, రాయపూడి వెంకటనారాయణ, కంబాల రంగ, పుల్లయ్యలు పాల్గొన్నారు.

## కెటిఆర్‌కు వినతి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పంచాయతీ ఎన్నికలలో జరిగిన తీవ్రమైన అన్యాయంపై మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) గొంగిడి సునీత మహేందర్ రెడ్డితో పలుగుల ఉమారాణి నవీన్ కుమార్ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా వాసాలమర్రి గ్రామ పంచాయతీ ఎన్నికలలో పలుగుల ఉమారాణి నవీన్ కుమార్‌కు జరిగిన అన్యాయాన్ని, ఎన్నికల ప్రక్రియలో చోటు చేసుకున్న అక్రమాలు, నియమావళి ఉల్లంఘనలు, ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలను పూర్తిగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు స్పష్టంగా ఇచ్చిన తీర్పును పక్కనపెట్టి, అన్యాయంగా ఫలితాన్ని మార్చే ప్రయత్నాలు జరిగాయని వివరించారు. ఈ అంశాలను శ్రద్ధగా విన్న కేటీఆర్, వాసాలమర్రి గ్రామ ప్రజలకు న్యాయం జరగాల్సిందేనని స్పష్టం చేశారు.



## కొనసాగుతున్న ఎన్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని ఎన్జి కళాశాల మైదానంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ పి ఎల్ 6 క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహం, ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి.మంగళవారం టోర్నమెంట్ నిర్వాహకులతో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ మాట్లాడుతూ గత రెండు వారాల నుంచి జరుగుతు న్న ఎన్ పి ఎల్ 6 క్రికెట్ టోర్నమెంట్ కు విశేష స్పందన లభిస్తుందని తెలిపారు.క్రీడాకారులను మరింత క్రీడాభిమానులను పరిచేందుకు బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జిఎంఆర్11 వర్సెస్ బి ఎస్ ఆర్ 11 టీంల మధ్య ఫ్రండ్లీ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందని పేర్కొన్నారు.కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే క్రికెట్ టోర్నమెంట్ ను తిలకించేందుకు ప్రతిరోజు వేల సంఖ్యలో క్రీడాభిమానులు వస్తున్నారని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం కొనసాగుతున్నందుకు కృషి చేస్తున్న ఆర్గనైజర్స్, స్పాన్సర్స్, క్రీడాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ కేసాని వేణుగోపాల్ రెడ్డి,బోనగిరి ప్రభాకర్, పాలకూరి శ్రీధర్, రమేష్,కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి,గాలి నాగరాజు,మామిడి కార్తీక్,పాదం అనిల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.




## డబుల్ ఓటింగ్‌పై విచారణ జరిపించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నిడమనూరు మండలం,ఎర్రగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో జరిగిన డబుల్ ఓటింగ్ పై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి దేశగాని బాలయ్య అధికారులను కోరారు. మంగళవారం నల్లగొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిడమనూరు మండలం ఎర్రగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి 13 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయానని తెలిపారు.మొదటి విడతలో 10మందికి పైగా చిన్నమాదారం గ్రామ పంచాయతీ, కనగల్ మండల పరిధిలో ఈనెల 11న ఓటుహక్కు వినియోగించుకున్న వారు మరలా మా గ్రామం ఎర్రగూడెం లో 14 న జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారని అదే విధంగా మరొక ఓటరు సోమోరిగూడెంలో ఓటు హక్కు వినియోగించుకొని తర్వాత మా గ్రామములో డబుల్ ఓటు వేశాడని తెలిపారు. మరో ఓటరు తిప్పర్తి మండలం గంగన్నపాలెం గ్రామములో 11 న ఓటు హక్కు వినియోగించుకున్న వారు మరలా మా గ్రామంలో 14న జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారని ఇలా 20 మంది ఓటర్లు వేర్వేరు ప్రదేశాల నుండి వచ్చి ఓటు వేయడంతో తాను ఓడిపోయానని తెలిపారు.వేర్వేరు ప్రదేశాల నుండి వచ్చిన వారి యొక్క ఓట్లపై విచారణ జరిపించి, వారి ఓట్లు తొలగించి కౌంటింగ్ లేదా రీ పోలింగ్ చేయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## రామన్నపేట మండల ఉపసర్పంచ్‌లు వీరే

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని 24 గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్‌లను ఈనెల 14న 21 గ్రామపంచాయతీల్లో, 15న మూడు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌లను, వార్డు సభ్యులను సోమవారం ఆర్‌వో అధికారుల సమక్షంలో సమావేశమై ఎన్నుకోన్నారు. రామన్నపేట మోటె రమేష్, బి.తుర్కపల్లి కన్నెబోయిన మల్లయ్య, బాచుప్పల జంగిలి యాదయ్య, బోగారం బైకాని ఉమా, ఇంద్రపాలనగరం పూలేపాక జయసుధ, ఇస్కిల్ల బందెల నగేష్, జనంపల్లి చొప్పరి నరసింహా, కొమ్మాయిగూడెం తిరుపాల ఐలయ్య, కొత్తగూడెం నీల ఆంజనేయులు, కుంకుడుపాముల నల్ల మధుసూదన్‌రెడ్డి, లక్ష్మాపురం నీల నరసింహా, మునిపంపుల తల్ల క్రాంతికుమార్, నీర్నెముల ఆవుల శ్రీశైలం, నిదాన్‌పల్లి కొండా ఆండాలు, పల్లివాడ పావిరాల మత్స్యగిరి, సర్నేనిగూడెం ననూనరు ఉపేందర్‌రెడ్డి, శోభనాద్రిపురం ముక్కాముల మల్లేష్, సిరిపురం మూడుదుడ్ల అనూష, సూరారం సంకబుడ్డి సైదులు, ఉత్తటూరు జెట్టి కృష్ణ, వెల్లంకి మిర్యాల రాజ్‌కుమార్, ఎన్నారం నల్ల జగదీశ్వర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

## కోల్డ్‌వేవ్స్ దృష్ట్యా ప్రజలు అప్రమత్తం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** రాబోయే రెండు, మూడు రోజులపాటు కోల్డ్‌వేవ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా తీవ్ర చలి, పొగమంచు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉదయపు సమయాల్లో హైవేలపై ప్రయాణించే వారు జాగ్రత్తలు పాటించాలని కోరారు. తెల్లవారుజామున ప్రయాణాలు చేయడం వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. వాహనాలు మంచి లైటింగ్ కండీషన్ ఉండాలన్నారు. ఇండికేటర్స్ ఉపయోగించాలి, రోడ్డుపై ఒక వరసలో వెళ్ళాలన్నారు. తక్కువ వేగంతో డ్రైవ్ చేయాలి, పాటలు మ్యూజిక్ పెట్టుకోవద్దని, ఓవర్ టెక్ చేయవద్దని సూచించారు. కచ్చితమైన మార్గంలో ఒకే లైన్‌లో వాహనం నడిపి, ఇండికేటర్‌లను ఉపయోగిస్తూ హారన్స్, వాహన శబ్ధాలను గమనిస్తూ సురక్షితంగా ప్రయాణించాలన్నారు.

## కుష్ఠ వ్యాధిపై అవగాహన



**ప్రజాపక్షం/అర్వపల్లి :** కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్ నాయక్ అన్నారు. ఈనెల 18 నుండి 31వ తేదీ వరకు నిర్వహించే (ఎల్‌సిడిసి) కుష్ఠ వ్యాధి కేసుల అనుమానిత నిర్ధారణ కార్యక్రమం గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి, ఆశ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటింటికి ఆశ కార్యకర్తలు వెళ్ళి స్పర్శ లేని, రాగి రంగు మచ్చలను గుర్తించాలన్నారు. ఎవరైనా వ్యాధిబారిన పడితే సకాలంలో గుర్తించి వారికి యం.డి.టి చికిత్స ద్వారా వైద్యం అందించినట్లయితే కుష్ఠ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ మాలోతు బిచ్చునాయక్, వీరయ్యలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రసన్నం కోసం అభ్యర్థుల తంటాలు

**ప్రజాపక్షం/గుండాల;** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఓటర్ల ప్రసన్నం కోసం అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నవైనం స్థానిక సంస్థల ఎన్నికల్లో కనబడుతుంది. గుండాల మండల వ్యాప్తంగా మూడవ విడతలో ఎన్నికల నిర్వహిస్తున్న నేపథ్యంలో ఓట్ల కోసం అభ్యర్థులు గ్రామ ప్రజల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ ఓట్ల వేయించుకునే పనిలో పడ్డారు. గ్రామాలలో రాత్రి అవ్వగానే ఇంటికే నేరుగా మద్యం, మాంసం, డబ్బులు అందిస్తూ ఓటర్లను అభ్యర్థులు ప్రసన్నం చేసుకుంటున్నారు. గత వారం రోజుల నుండి అభ్యర్థులు ఓటర్ల ప్రసన్నం కోసం ఇంట్లో మగవారికి మద్యం సీసాలు, ఆడవారికి కూల్ డ్రింక్స్‌తో పాటు పట్టు చీరలతో పాటు ఉంగరం గుర్తు వచ్చిన అభ్యర్థి ఏకంగా వెండి ఉంగరాలనే పంచుతూ ఓటర్లను తమ వైపు ఓట్లు వేసే విధంగా జాగ్రత్తలు పడుతున్నారు. గత వారం రోజుల నుండి గ్రామాల్లో మద్యం, మాంసం, విందులతో కళకళలాడుతూ గ్రామాల నిండా జనాలతో నిండిపోయి పండుగ వాతావరణం కనబడుతుందని. ఏది ఏమైన అభ్యర్థులు భవితవ్యం ఓటర్ల చేతుల్లో ఉండడంతో ఫలితాల వరకు వేచి చూడాలి.

## విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డును ఎస్ఎల్ఎస్ స్కాలర్స్ స్కూల్ విద్యార్థులు సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో పంటల కొనగోలు విధానం, నాణ్యత పరీక్షలు, తేమ శాతం కొలవడం వంటివి చూసి నేర్చుకోవాలన్నారు. రైతులు తమ పంటలను ఎలా అమ్ముకుంటారు, ప్రభుత్వం అందించే సౌకర్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి యండి ఫసియోద్దీన్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



## వర్కట్పల్లి గ్రామ సర్పంచిగా రమణమ్మ జనార్దన్‌రెడ్డి

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలోని వర్కట్పల్లి గ్రామపంచాయతీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా సోలిపురం రమణమ్మ జనార్దన్ రెడ్డి ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాపై నమ్మకంతో గెలిపించినందుకు నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

### వలిగొండ 12వ వార్డు సభ్యులుగా బుంగమట్ల యాదలక్ష్మి సుధాకర్ విజయం



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికలలో 12వ వార్డు సభ్యురాలిగా బుంగమట్ల యాదలక్ష్మి సుధాకర్‌ని మల్లేపల్లి గ్రామ ప్రజలు ఆశీర్వదించి గెలిపించినందుకు మల్లేపల్లి ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. 12వ వార్డులో ఉన్న సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పూర్తి చేస్తానని 12వ వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు.

### వార్డు నెంబర్‌కు సన్మానం బిఆర్ఎస్

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మేజర్ గ్రామపంచాయతీ నాలుగో వార్డ్ నెంబర్‌గా బిఆర్ఎస్ పార్టీ బలుగూరి నరేష్ రెడ్డి సమీప కాంగ్రెస్ అభ్యర్థి పై విజయ దుందుభి మోగించారు. బిఆర్ఎస్ మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సర్పంచ్ సీనియర్ బిఆర్ఎస్ నాయకులు పల్సం రమేష్ గౌడ్ నరేష్ రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



### కంచనపల్లి గ్రామ సర్పంచ్‌గా రేసు బుచ్చిరెడ్డి ఘన విజయం



**ప్రజాపక్షం/వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని కంచనపల్లి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా రేసు బుచ్చిరెడ్డి సమీప బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేగల పాండరి యాదవ్ పై 840 పై చిలుకు ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. సర్పంచ్‌గా గెలుపొందిన రేసు బుచ్చిరెడ్డి మాట్లాడుతూ కంచనపల్లి గ్రామాన్ని భువనగిరి శాసనసభ్యులకు కుమార్ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తానని ఆయన గ్రామ ప్రజలకు తెలిపారు.

## నేడు నల్లగొండలో కాంగ్రెస్ నిరసన

**డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత**

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:జాతీయ ఉపాధిహామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)లో మహాత్మా గాంధీ పేరును కేంద్ర ప్రభుత్వం తొలగింపునకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఉదయం 10 గంటల 30 నిమిషాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మహాత్మా గాంధీ చిత్రపటాలతో నిరసన వ్యక్తం చేయనున్నట్లు వెల్లడించారు.ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆక్షేపించారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన సర్పంచ్



**ప్రజాపక్షం/హాలియా** : నూతనంగా గెలుపొందిన ఇబ్రహీంపేట గ్రామ సర్పంచ్ ఎడవల్లి వంశీకృష్ణారెడ్డి మంగళవారం సాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డిని కలిశారు. యువకుడైన ఎడవల్లి వంశీకృష్ణారెడ్డిని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన ఎడవల్లి మహేందర్ రెడ్డి పై వంశీ కృష్ణారెడ్డి 94 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. దీంతో మంగళవారం సర్పంచ్ వంశీకృష్ణారెడ్డి తన తండ్రి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎడవల్లి నరేందర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డిని ప్రత్యేకంగా కలిశారు.

## ప్రజల ఆశీర్వాదంతో ఉప సర్పంచ్‌గా గెలుపు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ప్రజల ఆశీర్వాదంతో శివారెడ్డి గూడెం ఉప సర్పంచ్‌గా తనను గెలిపించారని గ్రామ ప్రజలకు రుణపడి సేవ చేస్తానని చిలుకల సంతోష్ యాదవ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో తమ పార్టీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచి బొక్క మల్లారెడ్డినీ తనను ఏకగ్రీవం చేసి విశ్వాసాన్ని బాధ్యతను మరింత పెంచారని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మరిన్ని నిధులు తెచ్చి అన్ని రంగాలలో సమున్నతంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండలం చిన్న లక్ష్మ పూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డిను ఇబ్రాహింపురం గ్రామం ఉపసర్పంచ్ నాగాయపల్లి శివరాములు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఘనంగా ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి తిరుమంజన సభను నిర్వహించిన అర్చక బృందం పట్టణంలోని వాణిజ్య భవన్ సెంటర్‌కు అమ్మవారిని తీసుకువచ్చి అక్కడి నుండి మేళతాళాలతో, భజనలతో, కీర్తనలతో అమ్మవారిని పల్లకి సేవగా ఆలయానికి చేర్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ప్రతిష్టించి స్వామివారికి అమ్మవారికి అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించి అమ్మవారు అందించిన తిరుప్పావై పాశుర పఠనం నిర్వహించారు. ఆండాళ్ గోష్టి సభ్యులు మంగళ హారతులు సమర్పించి తన్మయత్వం పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమ వైభవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణు గోపాలాచార్యులు భక్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీహరి ఆచార్యులు, సంకర్షణ ఆచార్యులు, ఫణి కుమార్ ఆచార్యులు, కార్యనిర్వాహణ అధికారి వై శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## కల్యాణానికి సిద్ధం అవుతున్న ఉత్తరగిరీశ్వరుడు

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మాంద్ర కక్కిరేణి శివార్లలో స్వయంబు శ్రీశ్రీ ఉత్తరగిరికరుణాలక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయంలో ఈ నెల 30 న వైకుంఠ ఏకాదశి పునస్కరించుకుని స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు బ్రహ్మ శ్రీ ఉత్తరపల్లి నరసింహాచార్యులు తెలిపారు.ఈ సందర్భంగా గుట్టపైకి భక్తుల సౌకర్యం కొరకు రోడ్డు పనులు జరుగుతుందన్నారు. గత సంవత్సరం రోడ్డు మార్గం గుట్ట దగ్గర వరకు ఉండగా,ఈసంవత్సరం గుట్ట మీది వరకు మల్లెబోయిన చంద్రమ్మ అయ్యన్న జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మల్లె బోయిన రమేష్ మత్యగిరి వారు పూర్తిగా గుట్ట మీదకు రోడ్డు వేపిస్తున్నారు.ఆలయ అర్చకులు బ్రహ్మ శ్రీ ఉత్తరపల్లి నరసింహాచార్యులు కరుణా శ్రీ దంపతులు పూజ చేసి ప్రారంభం చేసినార్రు. అర్చకులు బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి నరసింహచార్యులు మాట్లాడుతూ రోడ్డుపూర్తిగా చేస్తున్నందుకు మల్లె బోయిన రమేష్ మత్యగిరికి స్వామి అనుగ్రహం ఎల్ల వేళలా ఉంటుంది అని తెలుపుచున్నారు. మల్లె బోయిన రమేష్,జేసిపి బోడ రాజు,ఆగు యాదయ్య,రమేష్ భక్తులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లను అభినందించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బీబీనగర్** : ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా గెలుపొందిన గూడూరు గ్రామానికి చెందిన బింగి అలివేలు మంగ రాఘవపూర్ గ్రామానికి చెందిన సిద్ధగోని శ్రీకాంత్ గౌడ్‌లను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అభినందించారు. మంగళవారం హైదరాబాద్ ఎమ్మెల్యే నివాసంలో పలువురు సర్పంచులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం నూతన సర్పంచులు కృషి చేయాలని ఆయన కోరారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోలి పింగళి రెడ్డి, గడ్డం బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పోటోళ్ల శ్యామ్ గౌడ్, ఈసారపు అచ్చయ్య గౌడ్, ఉపసర్పంచ్‌లు జానా సత్యనారాయణ, సిల్వర్ కవిత, నాయకులు బద్దం మారుదేవ రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఇడికూడ సర్పంచ్ రమాదేవి

**ప్రజాపక్షం/చండూరు:** ఇటీవల డిసెంబర్ 11న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇడికూడ గ్రామ సర్పంచ్‌గా విజయం సాధించిన పాల్వాయి రమాదేవి శ్రవణ్‌రెడ్డి బుధవారం మునుగోడు మాజీ ఎంఎల్‌ఏ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామ పంచాయితీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తే తమకు సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలవుకు సహకరించిన బిఆర్ఎస్,బిజెపి పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఇడికూడ సర్పంచ్‌గా గెలుపొందిన పాల్వాయి రమాదేవి శ్రవణ్‌కుమార్‌రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి సోదరులు శ్రవణ్‌కుమార్ రెడ్డి, శంతన్‌రెడ్డి, ఇడికూడ మాజీ సర్పంచ్ నల్ల లింగయ్య యాదవ్ , తదితరులు ఉన్నారు.

## ఒక్కసారిగా కుప్పకూలిన వెయిటర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ పట్టణంలో ఓ రెస్టారెంట్లో విషాద ఘటన చోటు చేసుకోంది. సోమవారం రాత్రి పనిచేస్తున్న ఉండగానే వెయిటర్ ఆకస్మికంగా కుప్పకూలి మృతి చెందారు. నకిరేకల్ కు చెందిన చిన్నేని వెంకన్న (37) రెస్టారెంట్ లో వెయిటర్ గా పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా సర్వ్ చేస్తూ ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు.అపస్మారక స్థితిలో పడిపోయిన వెంకన్నను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.

## సర్పంచ్‌లకు అభినందన



**ప్రజాపక్షం/బీబీనగర్** : మండలంలోని చిన్నరావులపెల్లి, వెంకిర్యాల గ్రామానికి చెందిన నూతనంగా ఎంపికైన గ్రామ సర్పంచ్ చింతల నాగ లక్ష్మి, ఉప సర్పంచ్ లక్ష్మి నారాయణ, కొమర శ్రీకాంత్, ఉప సర్పంచ్ భరత్‌లను మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నివాసంలో వారు కలిసిన సందర్భంగా ఆయన శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు రాచమల్ల శ్రీనివాస్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొక్క జైపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మి నారాయణ, చింతల లక్ష్మి నారాయణ, చింతల రఘుపతి, సోమ రమేష్, టంగుటూరి గణేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిబండ గ్రామ ప్రజల అభిమానం వెలకట్టలేనిది

**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : నేను నిలబెట్టిన అభ్యర్థి మందుల నాగయ్యను గెలిపించిన గుడిబండ గ్రామ ప్రజల అభిమానం వెలకట్టలేనిదని కోదాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుడిబండ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నేను చెప్పిన అభ్యర్థి కాకుండా వేరే అభ్యర్థిని నిలబెట్టి సీనియర్ కాంగ్రెస్ నాయకుడునైన నాకే సవాలు విసిరారన్నారు. నేను 1981లో రాజకీయాలలో వచ్చి 1985లో కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. అప్పట్లో టిడిపి అధికారంలో ఉన్న మా గుడిబండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీనే బలంగా ఉందన్నారు. అప్పుడు కూడా సొంత పార్టీలోనే నాకు ఆర్థికంగా బలంగా ఉన్న ప్రత్యర్థులు, శత్రువులు ఉన్నారని తెలిపారు. ఎన్ని సమస్యలు ఉన్నా ఏనాడు నేను కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టలేదన్నారు. ప్రత్యర్థి వర్గం ఎన్ని ప్రగల్భాలు, డబ్బులు ఖర్చు చేసినా కానీ పేదల పక్షాన నిలబడి నేను నిలబెట్టిన అభ్యర్థికి నాపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన గ్రామ ప్రజలకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

## తొగర్రాయి గ్రామ సర్పంచ్‌గా లిక్కి గురవమ్మ



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** కోదాడ మండలం తొగర్రాయి గ్రామ పంచాయితీ మొదటి బిసి మహిళా సర్పంచ్‌గా లిక్కి గురవమ్మ ఎన్నికయ్యారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తనను గ్రామ సర్పంచ్‌గా, వార్డు సభ్యులను ఎన్నుకున్న గ్రామ ఓటర్లందరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ విజయం మహిళలు, యువత, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ కష్టం వల్లే దక్కిందన్నారు. భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురిచేసినా కత్తెర గుర్తుకు ఓటు వేసి ఓటుకు విలువ కట్టలేనిదని మరోసారి నిరూపించారన్నారు.

## లక్ష్మాపూర్ నూతన సర్పంచ్ పాలకవర్గానికి ఎమ్మెల్యే సన్మానం



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండలం చిన్నలక్ష్మాపురం గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ పార్వతి చిన్న నాయక్, పాలక వర్గం నూతన వార్డు మెంబర్లను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అభినందించి శాలువాలతో సన్మానించారు. మంగళవారం యాదగిరిగుట్టలోని ఎమ్మెల్యే నివాసంలో కొత్త పాలకవర్గం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని, లక్ష్మ పూర్ గ్రామ అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు.

## యువకుల ఉదార స్వభావం



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రంలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దాసరి ఎల్లమ్మ కుటుంబానికి ఎస్సీకాలనీ యువకులు అండగా నిలిచారు. గత కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగాలేక మంచానికే పరిమితమైంది భర్త దాసరి వెంకయ్య వయోభారం చేత ఎలాంటి కూలి పనులకు వెళ్లే పరిస్థితిలో లేదు దాంతో వారికి ఇల్లు గడవడం కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్సి కాలనీ యువకులు ఆమెకు సహాయం చేయాలనే ఉదార స్వభావంతో నెల రోజులకు సరిపడా నిత్య అవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో నూతన 7వ వార్డు మెంబర్ మాతంగి సుధీర్, ఏబీఆర్ యూత్ అధ్యక్షుడు పుట్టల మధు,దైద రాజు,బొంగర్ల వినోద్ ,పుట్టల చిన్న, పుట్టల రేవంత్ కుమార్,సతీష్ మచ్చ,జాన్ సన్నీ, పగడాల చందు, పుట్టల శ్రీను, పుట్టల సుమో సుధాకర్, పుట్టల జానయ్య,బొంగర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రతే ప్రథమ లక్ష్యం



**- మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకున్న 250 కోట్ల మంది**
**- విలేకరుల సమావేశంలో టిఎస్ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి**

**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర వ్యాప్తంగా మహాలక్ష్మీ పథకాన్ని ఇప్పటి వరకు 250 కోట్ల మంది మహిళలు ఆర్టీసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి వినియోగించుకున్నారని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండి నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం భద్రాచలంలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పదివేల బస్సుల్లో ప్రతి రోజూ 60 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం పుణ్యక్షేత్రం కావడంతో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పుణ్యక్షేత్రాలకు మహాలక్ష్మీ పథకాన్ని పెద్ద ఎత్తున వినియోగించుకోవడంతో ఆలయాలకు ఆదాయం గణనీయంగా పెరిగిందని చెప్పారు. రెండేళ్లలో 2500 కొత్తబస్సులు కొనుగోలు చేశామని, స్వయం సహాయక సంఘాల ద్వారా మరో 600 బస్సులు కొత్తవారికి అప్ప గించామని చెప్పారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా ఎలక్ట్రికల్ బస్సులనే నడుపుతామని, ఇప్పటికే హైదరాబాద్‌తో అనుసంధానమై ఉన్న ప్రాంతాలన్నిటిలో ఎలక్ట్రికల్ బస్సులు తిప్పుతున్నామని చెప్పారు. సంస్థ ప్రస్తుతం లాభాల్లోనే ఉందని, ఆదాయ వ్యయాలు పెరగడం తగ్గడం అనేది నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. మహాలక్ష్మీ పథకంతో కొంత మేరకు లాభాలా బాట పట్టామని తెలిపారు. ఆర్‌టిసి ప్రధాన సంస్థగా ఉన్న ప్రైవేటు బస్సులు ఆర్‌టిసి బస్టాండ్ పరిసరాల్లో నిలపడాన్ని పూర్తిగా అరికట్టేందుకు రవాణా శాఖ మంత్రితో మాట్లాడి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అన్ని డిపోల పరిధిలో ప్రజలకు అనుకూలమైన సమయాల్లో మరిన్ని బస్సులు తిప్పడంపై డిపోల డిఎంలు నిర్ణయాలు తీసుకుంటారని ప్రజలకు ఇందుకు సహకరించాలని కోరారు. భద్రాచలానికి సంబంధించి అంతర్రాష్ట్ర డిపో పరిమీట్ పరిధి మేరకు ఏపికి బస్సులు నడుపుతామని, మరిన్ని బస్సులను పెంచాలనే విజ్ఞప్తి పై ఏపి అధికారులతో చర్చిస్తామన్నారు. తెల్లవారు ఝాము సమయాల్లో బస్సులను పెంచే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు. ముందుగా ఆర్‌టిసి అధికారులతో ముచ్చటించారు. డిపోలో నెలకొన్న సమస్యలు, వాణిజ్య సముదాయాలపై వస్తున్న ఆదాయం, అంతర్రాష్ట్ర సర్వీసులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

# దాతల వితరణ, ప్రోత్సాహం మరువలేనిది




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రంథాలయాభివృద్ధికి దాతల వితరణలు, ప్రోత్సాహాలు మరువలేనివని గ్రంథపాలకురాలు గుమ్మడి మణి మృదుల అన్నారు. మంగళవారం తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ విద్యానగర్ కాలనీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలోని తల్లాడ మండలానికి చెందిన కిష్టాపురం గ్రామానికి చెందిన తూము వెంకటనారాయణ, షర్మిల దంపతులు, కుమార్తె చంద్రిక సుమారు రూ.6 వేల విలువ చేసే పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. వీటిలో క్యాట్, మ్యాట్, గేట్ కోటింగ్ కు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయని, గ్రంథాలయంపై ఆధారపడి చదువుకునే వారి ఉపయోగార్థం అందజేశారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు సీనియర్ సిటిజన్స్ అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ గత పదేళ్లుగా లైబ్రేరియన్ మృదుల విజ్ఞప్తి మేరకు కుర్చీలు, కూల్‌హాట్ వాటర్ డిస్పెన్సర్, ఎంబిఏ పుస్తకాలతో పాటు పలు రకాల పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే తరహాలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గ్రంథాలయం అనేది దేవాలయంతో సమానం అని, దీనిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. పుస్తకపఠనం అనేది మేధోశక్తిని పెంచుతుందని, కె సామ్యూల్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ శాస్త్రి, మైనేని నాగేశ్వరరావు, కొండా రాములు, గురుమూర్తి, జోసఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుల పట్ల శ్రద్ధ చూపాలి



**- ఐటిడిఏ పిఓ రాహుల్**
**- రొటెంత వాగు వంతెన పనులు పరిశీలన**

**ప్రజాపక్షం/చర్ల :** విద్యార్థులు చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మారుమూల అటవీ ప్రాంతమైన వద్దిపేట, ఉంజుపల్లి జిపిఎస్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిఓ ఉపాధ్యాయుని అవతారమెత్తి పిల్లల చేత బోర్డుపై అక్షరమాల, అధికారుల పేర్లు ఎలా రాయాలో వారిచే రాయించారు. ఉద్దీపకం వర్క్ బుక్ అంశాలు, చతుర్వేత పదాలాలు, గణితంలోని కూడికలు, తీసివేతలు, ఇంగ్లీష్ పదాలు పిల్లను అడిగి బోర్డుపై రాయించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారు విద్యాభ్యాసం బలోపేతం చేసేందుకు ఉద్దీపకం పుస్తకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. చాలా వరకు చిన్నారులు ఆపుస్తకంలోని అంశాలు అర్థం చేసుకుని చదవడం రాయడం చేస్తున్నారని, వెనుకబడిన వారిని సంబంధిత ఉపాధ్యాయులు సరిచేయాలని సూచించారు. అనంతరం రూ. 4.3 కోట్ల 30సక్షలతో పూసుగుప్ప రోడ్డు మార్గంలోని రొటెంత వాగు వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల రాకపోకలు జరిగేందుకు గుత్తేదారు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ టిపి శ్రీనివాస్, ఎస్‌సి ఆర్ పి జయ ప్రకాష్, ఉపాధ్యాయులు రాజ్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ పోలింగ్‌కు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలో 130 పంచాయతీలు కాగా అందులో సత్తుపల్లి మూడు, కల్లూరు రెండు, పెనుబల్లి ఒకటి, వేంసూరు మూడు, తల్లాడ మూడు పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగతా 118 పంచాయతీలకు నేడు ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధానంగా నియోజకవర్గ ప్రధాన కేంద్రం సత్తుపల్లి మండలంలోని 180 పోలింగ్ కేంద్రాలకు గానూ 550 మంది అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, 150మంది పోలింగ్ అధికారులు, 23 మంది ఆర్వోలు నియమితులయ్యారు. మండలాన్ని ఏడు క్లస్టర్లుగా ఎంపిక చేసిన అధికారులు ఏడు గురు రూట్ అధికారులను నియమించారు. సమస్యాత్మక గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లుగా పేర్కొన్నారు.

**డివిజన్ లో 163బిఎన్ఎస్ యాక్ట్ అమలు..**

పంచాయతీ ఎన్నికల సందర్భంగా సత్తుపల్లి డివిజన్ లో 163 బిఎన్ఎస్ యాక్ట్ అమల్లో ఉందని ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ఓటర్లు సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# ముక్కోటి ఏకాదశికి రండి

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ఆహ్వానించిన ఇఓ**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈనెల 29,30 తేదీల్లో భద్రాచలంలో జరగనున్న స్వామివారి తెప్పోత్సవం, ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు రావాలని కోరుతూ జిల్లా ప్రధాన న్యామూర్తి పాటిల్ సంపత్‌కు మంగళవారం శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి దామోదర్ రావు ఆహ్వాన పత్రికను అందజేశారు. న్యాయమూర్తి ఛాంబర్లో ఇఓ న్యాయమూర్తిని సన్మానించారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆలయంలో చేపడుతున్న ఏర్పాట్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీరు, వసతి, వైద్యసదుపాయాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణతో పాటు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు ఉత్సవాన్ని భక్తులు మెచ్చేలా నిర్వహించాలని సూచించారు.

# విలువలతో కూడిన విద్యకు లైన్స్ క్వెస్ట్

**-విద్యార్థులను తీర్చిదిద్దేందుకు శిక్షణ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విద్యార్థులలో జీవన నైపుణ్యాలు పెంచటానికి, విద్యార్థుల సర్వతో ముఖ అభివృద్ధి ధ్యేయంగా "లైన్స్ క్వెస్ట్ " నిర్వహిస్తున్నట్లు శిక్షకురాలు కొండపల్లి రేణుక అన్నారు. సత్తుపల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కెపిఆర్ గౌతమ్ మోడల్ స్కూల్ లో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. సత్తుపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రమేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రేణుక మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో, ఇంట్లో, బయట విద్యార్థుల ప్రవర్తనను మెరుగుపరచడం ద్వారా భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలనే లక్ష్యంతో, అనేక సంవత్సరాలుగా టీచర్లకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం ,స్నేహ సంబంధాలు, కుటుంబ సంబంధాలు, లక్ష్యాలు పెంపొందించడానికి రెండు రోజులపాటు ఉపాధ్యాయులకు జరిగే కార్యక్రమం శిక్షణ కార్యక్రమం వారికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తయారు చేయడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలోసత్తుపల్లి ప్రాంతంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, లైన్స్ క్లబ్ జిఈటి గవర్నర్ మందపాటి ప్రభాకర్ రెడ్డి, జంగా సత్యనారాయణ, పెనుగొండ రమేష్, ప్రిన్సిపల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడి ప్రత్యర్థులు గెలిచారని ఆరోపిస్తూ మాలోత్ రంగ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రఘునాథపాలెం మండలం హర్యాతండాలో చోటు చేసుకుంది. రంగ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 11న జరిగే పంచాయతీ ఎన్నికల్లో తన భార్య మాలోత్ చింతామణి పోటీ చేసి ఓడిపోయిందన్నారు. ఎన్నికల్లో రిగ్గింగ్ పాల్పడి ప్రత్యర్థులు గెలుపొందారని దీనికి సంబంధించి పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదని ఆయన ఆరోపించారు. దీనితో మనస్తాపం చెంది తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని రఘునాథపాలెం పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా గత శుక్రవారం సెల్ టవర్ ఎక్కి తనకు న్యాయం చేయాలంటూ రంగ హల్‌చల్ చేశాడు.

# రామాలయంలో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ధనుర్మాసం సందర్భంగా మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభ సందర్భంగా మంగళవారం మొదటి రోజు ఆలయంలో ఆండాళ్ తల్లి పూజ నిర్వహించారు. ఆలయ పూజారి భార్గవాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి భార్గవాచార్యులు తెలిపారు.

# కొత్త సంవత్సరంలో రహదారిని అందుబాటులోకి తీసుకురావాలి



**-జనవరి నాటికి ఆర్‌వోబి పనులు పూర్తి చేయాలి**
**-ఆకస్మికంగా గ్రీన్ ఫీల్డ్ హైవే, ఆర్ఒబి పనుల తనిఖీ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కొత్త సంవత్సరంలో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రావాలని, రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ ఆరోఓబి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం ధంసలాపురం వద్ద ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఖమ్మంకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను క్షేత్ర స్థాయిలో తిరుగుతూ పరిశీలించారు. నమూనా మ్యాపులను చూసి ఏజెన్సీలకు సూచనలు చేశారు. నిర్మాణ దశలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని పనులను వేగవంతం చేసి జనవరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారిపై ధంసలాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి మున్నేరుపై బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఖమ్మం ప్రజలకు, పక్క రాష్ట్రం వారికి ఈ జాతీయ రహదారి ఉపయోగపడుతుందన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి, కాంక్రీట్ వాల్ జనవరి నాటికి పూర్తి చేయాలని రోడ్డు నిర్మాణంలో సేఫ్టీ నియమాలు పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఆర్ఓబి నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ వంటి అన్ని పనులు పూర్తి చేశామని ఒక వైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుంటే సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం వరకు ఉపయోగపడుతుందన్నారు. రహదారి వాహనాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ సర్వీస్ రోడ్లు, మున్నేరు బ్రిడ్జితో పాటు ధంసలాపురం ఎగ్జిట్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్ భూసేకరణ పనులు నిరంతరం మానిటరింగ్ చేస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే పిడి దివ్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో గ్రామ పంచాయతీలో మలుపు తిరుగుతున్న గెలుపు





**ప్రజాపక్షం/ తల్లాడ :** నేడు జరుగుతున్న 3వ విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో తల్లాడ గ్రామపంచాయతీ అభ్యర్థుల గెలుపు మలుపు తిరుగుతుంది. తల్లాడ మేజర్ గ్రామపంచాయతీలో తెలుగుదేశం, బిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి పెరిక నాగేశ్వరరావు( చిన్నబ్బాయి) మండలంలో ప్రతి ఒక్కరికి తెలిసిన వ్యక్తి కావడంతో పాటు గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు వచ్చి వారికి మంచి చేసే విధంగా సహాయ సహకారాలు అందించే వ్యక్తి కావడంతో పాటు ఆయన ఒక బిసి కులానికి చెందిన వారు కావడం తల్లాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కొత్త మలుపు నెలకొంది. తల్లాడ మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ బరిలో బిజెపి బలపర్చిన చల్లా నాగులు, టిడిపి, టిఆర్ఎస్ బలపర్చిన పెరిక నాగేశ్వరరావు, కాంగ్రెస్ బలపర్చిన దగ్గుల రఘుపతిరెడ్డి ,స్వతంత్ర అభ్యర్థి రోబో బరిలో ఉండగా పెరిక నాగేశ్వరరావు, దగ్గుల రఘుపతి రెడ్డి మధ్య గట్టి పోటీ ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. వ్యక్తిపరంగా పెరిక నాగేశ్వరరావు ప్రజల మనిషి కావడం అందరితో కలిసి తిరిగే బిసి కులానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ అన్ని కులాల్లో మంచి పేరు ఉన్న వ్యక్తి రఘుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి పార్టీని మండలంలో బలోపేతం, అభివృద్ధి చేసిన వ్యక్తి కావడంతో ప్రధానంగా వీరిద్దరిలో ఒకరు గెలిచే అవకాశం ఉంటుందని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. స్వతంత్ర అభ్యర్థి రోబో ఈ ఎన్నికల్లో ఎక్కువ ప్రభావం చూపించపోయినా తల్లాడ గ్రామపంచాయతీలో రెండు కులాల, వ్యక్తిత్వాల మధ్య పోటీ జరుగుతుంది. ప్రస్తుతం అభ్యర్థుల్లో కొందరు డబ్బులు, మందు, మాంసం పంపిణీ ద్వారా ప్రజలను ఆకట్టుకుని ఓటు వేయించే పనిలో ఉన్నారు. అయినప్పటికీ ప్రజలు ఈ పంచాయతీ ఎన్నికల్లో ఎవరిని గెలిపిస్తారో వేచిచూడాల్సిందే.

# పోలింగ్ కేంద్రాలకు చేరిన సామగ్రి, సిబ్బంది







**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని మూడవ దశ పోలింగ్ 17వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు జరుగునున్న పోలింగ్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాల నుంచి మంగళవారం సాయంత్రానికి చేరుకున్నారు. 21 గ్రామపంచాయతీ లలో 194 పోలింగ్ కేంద్రాలకు గాను ఎనిమిది వందల మంది సిబ్బంది చేరుకున్నారు. మండలాన్ని 9 రూట్లుగా ఏర్పాటు చేసి ముగ్గురు జోనల్ అధికారులు సిఐలు, ముగ్గురు డిఎస్పి ఒక్కరు డిసిపి ఒక్కరు ఎస్ఐలు పది మంది, మొత్తం పోలీస్ సిబ్బంది 160 మంది ఉన్నట్లు ఎస్పి హరిత తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు తమ ఓటును వినియోగించుకొని ప్రధమ పౌరుని తమ అమూల్యమైన ఓటు ద్వారా ఎంపిక చేసుకోవాలని ఓటర్లను ఎస్ఐ కోరారు. మంగళవారం సాయంత్రం బుధవారం జరగనున్న పంచాయతీ ఎన్నికల కోసం అధికారులు కల్లూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి వాహనాలపై సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ అధికారులు సహాయ పోలింగ్ అధికారులు మొత్తం గ్రామాలలో 800 మంది ఎన్నికల కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఎన్నికల అధికారులు చంద్రశేఖర్ పులి సాంబశివుడు లు తెలిపారు.

# జూపల్లి రమేష్‌బాబును కలిసిన సర్పంచ్ సత్యం లక్ష్మీకుమారి, ఉపసర్పంచ్ సాదు జోషి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి గ్రామపంచాయతీలో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని పనిచేస్తున్న గ్రామ సర్పంచ్ సత్యం లక్ష్మీ కుమారి, ఉపసర్పంచ్ సాదుజోషి , గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కలిసి మండలస్థాయి నాయకుడు జూపల్లి రమేష్‌బాబును కలుసుకుని తమ ఆనందాన్ని హర్షాతిరేకాలతో వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వివిధ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, తాగు నీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాబోయే రోజుల్లో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేయాలనే దృఢ సంకల్పాన్ని నాయకులు వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ సత్యం లక్ష్మీ కుమారి, ఉపసర్పంచ్ సాదు జోషిని శాలువాతో ఘనంగా సత్కరించి గ్రామాభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపారు. జూపల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ ఊట్లపల్లి గ్రామ పంచాయతీ నాయకత్వం ఐక్యంగా పనిచేస్తుండటం అభినందనీయమని అన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన సహకారం, మార్గదర్శనం చేసేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 160 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అక్రమంగా తరలిస్తున్న 160 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు, రఘునాథపాలెం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఖమ్మం అర్బన్ సివిల్ సప్లయ్ డిటి మెచ్చు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని రేగులచలక గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి నాగేశ్వరరావు రేషన్ బియ్యాన్ని బోలోరో వాహనంలో గ్రామ శివారుకు తరలించి మరో లారీలోకి లోడ్ చేస్తుండగా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో మూడు బోలేరో వాహనాల్లో 352 ప్లాస్టిక్ బస్తాల్లో బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. పట్టుబడిన బియ్యం 153.50 క్వింటాళ్లు ఉన్నాయని తెలిపారు. వ్యాపారి నాగేశ్వరరావు రేషన్ బియ్యాన్ని లబ్దిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిందని డిటి తెలిపారు. బియ్యం వ్యాపారి నాగేశ్వరరావుతో పాటు వాహన డ్రైవర్లు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మూడు బోలెరో వాహనాలు, ఒక లారీని స్వాధీన పర్చుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. పట్టుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించడం జరిగిందన్నారు.

# సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డికి సన్మానం



**ప్రజాపక్షం/వైరాః** వైరా మండల నారపునేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజలకు మంచి పాలన అందించారని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో తల్లపురెడ్డి గోపాలకృష్ణారెడ్డి, ఐవిఎస్ఎన్.రెడ్డి, శ్రీనివాస భాస్కర్‌రెడ్డి, అయిలూరి మోహన్‌రెడ్డి, అయిలూరి శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# తెట్టెలపాడులో నూతన చరిత్ర

**- వరుస విజయాలకు తెర**



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** రెండవ విడత జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండల పరిధిలోని తెట్టెలపాడు గ్రామస్తులు నూతన చరిత్రకు తెర లేపారు. దశాబ్దాలుగా ఈ గ్రామం సిపిఐ (ఎంఎల్)కు కంచుకోటలా నిలిచింది. ఆ పార్టీకి చెందిన వారే ఇక్కడ వరుస విజయాలు సాధిస్తూ వస్తున్నారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన చిర్రా నర్సమ్మ 551 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. మొత్తం 10 వార్డులకు గాను తొమ్మిది వార్డుల్లో బిఆర్ఎస్ విజయం సాధించింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా నాయకులు బిల్లగిరి ధనుంజయ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం అదిరింపులు బెదిరింపులతో స్థానిక సంస్థల్లో గెలుస్తూ వచ్చారని కాని తెట్టెలపాడు గ్రామ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించారని ఆయన తెలిపారు. ఒక వార్డులో ఓటుకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు ఇచ్చినా సరైన ఫలితం దక్కలేదని కేవలం రెండు ఓట్లతో గెలిచారని ధనుంజయ్ తెలిపారు. నూతన చరిత్రకు అవకాశం ఇచ్చిన తెట్టెలపాడు ప్రజల రుణం తీర్చుకునేలా బిఆర్ఎస్ నేతల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. 1981 నుంచి వరుస విజయాలు సాధిస్తున్న పార్టీని ఓడించి మమ్మల్ని గెలిపించిన ప్రజల ఆశలకు అనుగుణంగా గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తామన్నారు. గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన చిర్రా నర్సమ్మ మాట్లాడుతూ గ్రామ ప్రజల నమ్మకాన్ని వమ్ము కాకుండా కాపాడతానని పార్టీ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, వివక్షకు తావులేకుండా వ్యవహరిస్తానని తెలిపారు.

# యథేచ్ఛగా కొనసాగిన ప్రలోభాల పర్వం

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో మూడవ దశ పోలింగ్ ఎన్నికలు సందర్భంగా మంగళవారం రాత్రి వరకు ప్రలోభాలపర్వం యదేచ్ఛగా జరిగింది. 400 చీర, జాకెట్, సుక్క, ముక్క, విందు ఓటర్లను లొంగదీసుకునేందుకు అనేక రకాలుగా వ్యాపారం వలె ప్రలోభం కొనసాగింది. కొన్ని గ్రామాలలో ఓటుకు వెయ్యి, మరికొన్ని గ్రామాలలో 4000 చేయగా చికెన్, మందు విపరీతంగా పంపిణీ చేస్తూ ఓటర్లను ఆకర్షించారు. ప్రధానంగా జనరల్ స్థానాలైన ఎర్రబోయినపల్లి, రఘునాథ్ గూడెం, చంద్రు పట్ల, పెద్ద కోరుకొండి, మర్లపాడు, ముగ్గు వెంకటాపురం, చిన్న కోరుకొండి, పేరువంచ, లక్ష్మీపురం గ్రామాలలో అధికంగా ఓటర్లకు ఎరపెట్టగా, ఎస్సీ స్థానమైన లింగాలలో ఇరు వర్గాల్లో పోటాపోటీగా పంపిణీ చేశారు. గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ స్థానాల్లో ఆ ప్రభావం తక్కువగా చూపెట్టింది. అదే విధంగా పట్నం నుంచి పల్లెకు సుమారుగా గ్రామాలకు 5000 మంది వలస ఓటర్లు చేరారు. ఈ విధంగా గ్రామాలలోని గృహాలలో ఓట్ల పండుగ సంతరించుకుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. అధికంగా ఎవరు ఎక్కువ పంపిణీ చేస్తే వారికే పట్టం ప్రజలు కడతారని ఆలోచనతో ఆ విధంగా ఎక్కువ పంపిణీ చేశారు. ఒకరికొకరు పోటీపడి పలు రకాల పలు విధాలుగా పంపిణీ చేశారు. ఓటు గెలుస్తుందా నోటు గెలుస్తుందా అనే ప్రశ్నార్థకంగా మారింది. అభ్యర్థుల్లో దడ దడ లబ్ డబ్ ఎవరు ధీమా వాళ్ళదే అన్నట్లుగా ఉంది.